

వందల కోట్ల విలువైన...

మఠం భూములు హాంఫట్

ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు
జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ బదిలీ కలకలం
ఉన్నతాధికారులపై చర్యలు శూన్యం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వందల కోట్ల విలువైన హాథీరాంజీ మఠం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.. ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేశారన్న ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ జి.శివకుమారి బదిలీ కలకలం రేపుతోంది. అయితే ఉన్నతాధికారులపై ఏమాత్రం చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నెలరోజులుగా హాథీరాంజీ మఠం భూములు లీజుదారులకు అనుకూలంగా రిజిస్ట్రేషన్లు చేయడమే కాకుండా, లీజుదారులతో ఉన్నతాధికారులు కుమ్మక్కయినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ ఫిర్యాదులు తారాస్థాయికి చేరుకున్నాయి. ఈ భాగోతం గత మూడేళ్లుగా నడుస్తోంది. అయితే ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే సమస్యలు తారాస్థాయికి చేరాయన్న విమర్శలు ఉన్నాయి. హాథీరాంజీ మఠం భూముల రిజిస్ట్రేషన్‌లో తిరుపతి బాలాజీ జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

తిరుపతి అర్బన్‌పరిధిలోని బైరాగిపట్టెడ సమీపంలో ఎంకె నాయుడు కాలనీ వద్ద సర్వే నంబర్ 242-బిలో 9.89 ఎకరాల విస్తీర్ణంలో హాథీరాంజీ మఠానికి చెందిన భూమి ఉంది. ఈ స్థలంలో కొంత భాగాన్ని వ్యవసాయ నిమిత్తం లీజుకిచ్చారు. లీజు గడువు ముగియడంతో 2003లో 379 జీవో ప్రకారం మఠం సదరు వ్యక్తికి నోటీసు ఇచ్చింది. దీంతో ఇద్దరూ న్యాయ పోరాటానికి దిగారు. మఠం ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఇంటీరియం ఉత్తర్వులు ప్రకారం కేసు పూర్తయ్యేవరకు లీజుదారు నుంచి రూ 11వేలు ఏడాదికి కట్టించుకున్నారు. కాలం చెల్లిన లీజును అడ్డుపెట్టుకొని హంథీరాంజీ మఠం స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. అధికార పార్టీకి చెందిన వారు ఇందులో ఉన్నారు. అక్కడ పాల డెయిరీ పేరుతో బోర్డు పెట్టారు. అక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. పెద్దపెద్ద కట్టడాలు వెలిశాయి. కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి సుమారు 31 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఇది తిరుపతి బాలాజీ జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ కిందకు వస్తుంది.

డిఆర్ పాత్రపై అనుమానాలు

హంథీరాంజి మఠం భూములు రిజిస్ట్రేషన్‌లో జిల్లా సబ్ రిజిస్ట్రార్ పాత్ర కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మఠానికి సంబంధించిన భూములు లీజుదారులు తమ గుప్పిట్లో ఉంచుకోని రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నా జిల్లా సబ్ రిజిస్ట్రార్ ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్న. వంద కోట్లు పైగా విలువైన భూములు రిజిస్ట్రేషన్ జరగడానికి వెనక జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కీలకంగా పనిచేసిన వారి అస్త్రం ఉందని తెలుస్తోంది. హంథీరాంజి మఠంలో విలాసవంతమైన నిర్మాణాలు ఉన్నప్పటికి ఖాళీ స్థలానికే రిజిస్ట్రేషన్ చేసేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర రూ80లక్షలు నుంచి 90లక్షలు ఉంది. ఈమేరకు టిడిఎస్ కూడా చెల్లించలేదని తెలిసింది. తిరుపతి బాలాజీ జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చాలామంది ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్లు పని చేశారు. కొంతమంది డిప్యూటేషన్ పద్దతిలో కూడా పనిచేస్తున్నట్లు సమాచారం. గతంలోనూ హంథీరాంజి మఠానికి సంబంధించిన ఫైల్సు కాల్చివేసిన సంఘటనలూ ఉన్నాయి. అప్పట్లో ఆ అధికారినీ సస్పెండ్ చేయడం గమనార్హం.

దీక్ష భగ్నం

చిందేపల్లివాసులపై లాఠీఛార్జి
మహిళలకు, పోలీసులకూ గాయాలు
'వినుత'ను రుయాకు తరలింపు



దీక్షా శిబిరం వద్ద వినుతకు ఆరోగ్య పరీక్షలు



తిరుపతి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ల్యాంకో(ఎలెక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్) పరిశ్రమ చిందేపల్లి రహదారికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని డిమాండు చేస్తూ తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లె వాసులు, జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజక వర్గం ఇన్‌ఛార్జి వినుత మూడు రోజులుగా చిందేపల్లె శివాలయ ఆవరణలో చేపట్టిన ఆమరణ దీక్షను బుధవారం సాయంత్రం పోలీసులు భగ్నం చేశారు. అడ్డుకోవడానికి యత్నించిన చిందేపల్లె వాసులపై పోలీసులు విచక్షణా రహితంగా లాఠీ ఛార్జి చేశారు. ఈ లాఠీ ఛార్జిలో సుమారు 20మంది మహిళలు గాయపడ్డారు. ఆందోళనకారుల తిరుగుబాటులో గాజులమండ్యం సీఐ ఆరోహణరావు, బుచ్చినాయుడుకండ్రిగ ఎస్ఐ శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న జనసేన నేత వినుతను తిరుపతి రుయాకు తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే...

ఏర్పేడు మండలం చిందేపల్లెకు వెళ్లే రహదారిని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్(ఈసీఎల్) పరిశ్రమ వారు ఈ నెల 18న మూసి వేసిన సంగతి తెలిసిందే. రహదారికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని డిమాండు చేస్తూ చిందేపల్లె వాసులు ఆ రోజు నుంచి నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈసీఎల్ వద్ద భారీగా పోలీసులను మొహరించారు. చిందేపల్లె వాసులకు మొదట సీపీఎం, తెలుగుదేశం, జనసేన, మానవ హక్కుల వేదిక వారు మద్దతు ప్రకటించారు. రహదారికి అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని ఈ పార్టీల వారందరూ డిమాండు చేశారు. అయినా అధికారులు కానీ, యాజమాన్యం కానీ స్పందించలేదు. దీంతో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ సోమవారం



చిందేపల్లివాసులపై పోలీసుల వీరంగం

నుంచి చిందేపల్లె శివాలయంలో ఆమరణ దీక్ష ప్రారంభించారు. ఈ ఆమరణ దీక్షలో వినుతతో పాటు ఆమె భర్త చంద్రబాబు, చిందేపల్లెకు చెందిన చెంచురెడ్డి, మహానందరెడ్డి, మోహనరెడ్డి, చెంచురామయ్య, లోకేష్, వెంకటసుబ్బయ్య రాయల్, వెంకటరత్నం, తులశమ్మ, రేణుక, భారతి, సాయికుమార్, ఢిల్లీబాబు, అనిల్ కుమార్, శ్రీనివాసులు, గిరిప్రసాద్ ఆమరణ దీక్షలో పాల్గొన్నారు. తిరుపతి కలెక్టరు వెంకట్రమణారెడ్డి వస్తే తమ సమస్యను వివరించి ఆమరణ దీక్ష విరమించాలనేది వీరి ఆలోచన. అయితే కలెక్టరు కానీ... ఇతర అధికారులు కానీ చిందేపల్లెకు రాలేదు. ఆమరణ దీక్ష చేపట్టి మూడు రోజులు కావడంతో జనసేన నేత వినుత కోట ఆరోగ్యం క్షీణించింది. ఈమె శరీరంలో చక్కెర స్థాయి పడి పోయింది. ఆమరణ దీక్షలో పాల్గొన్న చిందేపల్లెకు చెందిన కొందరి ఆరోగ్యం కూడా క్షీణించింది. అయినా వీరు ఆమరణ దీక్షను కొనసాగించాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా చిందేపల్లె వాసులు చేస్తున్న ఆమరణ దీక్షను ఎలాగైనా భగ్నం చేయాలని పోలీసులు పథకం రచించారు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట, గాజులమండ్యం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలను చిందేపల్లెకు రప్పించారు.

శివాలయం తలుపులు బద్దలు కొట్టి మరీ..

ఆమరణ దీక్ష భగ్నం చేయడానికి పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న జనసేన నేత వినుత, మరికొంత మంది శివాలయం లోపలికి వెళ్లి తలుపులు వేసుకుని దీక్ష కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు బలవంతంగా గర్భాలయ తలుపులు పగల గొట్టారు. బూట్లతోనే గర్భాలయంలోకి ప్రవేశించారు. వినుతను బలవంతంగా అంబులెన్సు ఎక్కించి తిరుపతి రుయాకు తరలించారు. అడ్డుకోవడానికి యత్నించిన వినుత భర్త చంద్రబాబును పోలీసులు కొట్టారు. ఈ ఘటనలో చంద్రబాబుకు రక్త గాయాలయ్యాయి.

విచక్షణా రహితంగా లాఠీ ఛార్జీ

చిందేపల్లె వాసులు చేస్తున్న ఆమరణ దీక్ష భగ్నం చేయడానికి పోలీసులు యత్నించడంతో గ్రామస్థుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. దీక్ష భగ్నం చేయకుండా అడ్డుకోవడానికి గ్రామస్థులు యత్నించారు. తాము శాంతియుతంగా ఆమరణ దీక్ష చేస్తున్నామని... కలెక్టరు వచ్చి హామీ ఇస్తే విరమిస్తామని చెప్పారు. అయినా పోలీసులు అంగీకరించలేదు. శివాలయం తలుపులు పగుల గొట్టడంతో ప్రజలు ఆగ్రహానికి గురయ్యారు. పోలీసులను అడ్డుకోవడానికి యత్నించారు. అడ్డుకోవడానికి యత్నించిన వారిపై పోలీసులు విచక్షణా రహితంగా లాఠీ ఛార్జి చేశారు. ఈ లాఠీ ఛార్జిలో సుమారు ఇరవై మంది మహిళలు గాయపడ్డారు. లాఠీ ఛార్జి చేసి ఆమరణ దీక్ష భగ్నం చేశారు.

పోలీసుల అదుపులో చిందేపల్లి వాసులు

ఆమరణ దీక్ష భగ్నం చేసిన తరువాత చిందేపల్లెకు చెందిన చెంచురెడ్డి, మోహన్ రెడ్డి (విద్యార్థి), చలపతి, అనిల్ కుమార్ తో మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ఏ పోలీస్ స్టేషన్ కు తరలించారో తెలియక గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా పోలీసుల తీరును పలువురు ఖండించారు.

కార్మికులకు అస్వస్థత

ముగ్గురి పరిస్థితి విషమం



ప్రజాశక్తి- రేణిగుంట

మండలంలోని విమానాశ్రయం సమీపంలో ఉన్న కర్బామ పరిశ్రమంలో గ్యాస్ లీకేజీతో 11 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. అందులో ముగ్గురి కార్మికులు పరిస్థితి విషమంగా మారింది. ఈ పరిశ్రమలో బుధవారం ఉదయం ఒక విభాగంలో ఒక రకమైన గ్యాస్ లీకై అక్కడ పనిచేస్తున్న మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 11 మందికి ఇబ్బంది ఏర్పడగా వీరిని చికిత్స నిమిత్తం బాలాజీ హాస్పిటల్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం ఈ 11 మందిలో ముగ్గురి పరిస్థితి విషమించగా వారిని చికిత్స నిమిత్తం అమర హాస్పిటల్ కి తరలించారు. అయితే ఘటన పై అటు పరిశ్రమ యాజమాన్యం.. ఇటు సంబంధిత అధికారులు స్పందించకపోవడం దారుణమని తోటి కార్మికులు వాపోతున్నారు. అస్వస్థతకు గురైన వారిలో విమల, జయంతి, సుప్రియ, రీటా, పుష్ప, శిరీష, భూమిక, శిరీష ఉన్నారు. వెంటనే వీరికి మంచి వైద్యం అందించి వీరిని అన్ని విధాలుగా ఆదుకోవాలని యాజమాన్యాన్ని రేణిగుంట మండల సిఐటియు నాయకులు నర్సింహారెడ్డి, సెల్వరాజ్, ఓ వెంకటరమణ డిమాండ్ చేశారు.

తిరుమల ప్రతిష్టను దిగజార్చొద్దు: ఎమ్మెల్సీ సిపాయి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుమలలో ఓ కాంట్రాక్టు కార్మికుడి వద్ద చిన్న మొత్తంలో పట్టుబడ్డ గంజాయిని పట్టుకున్నది నిఘా అధికారులేనని, ఈ సంఘటనను టిడిపి తన స్వార్ధ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటూ తిరుమల ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తోందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదేని అసందర్భంగా జరిగిన సంఘటనలను మంగళగిరి కేంద్రంగా తెలుగుదేశం పార్టీ ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ ద్వారా ప్రజల్లో తప్పుడు ప్రచారాలను పంపిస్తుంటారన్నారు. తులసివనం లాంటి తిరుమల క్షేత్రాన్ని గంజాయి వనంగా మాట్లాడడం సబబు కాదన్నారు. తిరుమల క్షేత్రంలో ఏ చిన్న సంఘటన జరిగిన యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులకు చేరుతుందని, టిడిపి చేస్తున్న ప్రచారాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందుకనే టిడిపి ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీ నుండి తిరుమలను మినహాయించాలని కోరారు. మంగళవారం మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ నిర్వహించిన నిరసనలో పాల్గొన్న వారిలో కొంత మంది మద్యం, మాంసం తరలిస్తూ పట్టుబడలేదా అని ప్రశ్నించారు. తిరుపతిలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం స్థానిక శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి గతంలో ' సే నో టు డ్రగ్స్ ' కార్యక్రమాన్ని నిర్వహించి తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడడానికి కషి చేశారని గుర్తు చేశారు. తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం శ్రీవారి భక్తులు, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించవద్దని టిడిపి పార్టీకి హితవు పలికారు.

3నుంచి టెన్త్ పరీక్షలు

హాజరుకానున్న 28,412మంది విద్యార్థులు
డిఇఒ కార్యాలయంలో కంట్రోల్ రూం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏప్రిల్ 3-18 వరకు ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతి నుంచి విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్య ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్‌కుమార్ వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా విద్యాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి బుధవారం మధ్యాహ్నం సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 152 పరీక్షా కేంద్రాల నుంచి 28,412 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని, పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా రెగ్యులర్ పదో తరగతి పరీక్షల నిర్వహణ జరుగుతోందని, ఎలాంటి పొరబాట్లు జరగకుండా చూడాలని సూచించారు. పదో తరగతి పరీక్షా పత్రాలు ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల స్ట్రాంగ్ రూము నుండి సంబంధిత 40 పోలీసు స్టేషన్లలో స్టోరింగ్ పాయింట్లలో భద్రపరిచామన్నారు. ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్లో స్పాట్ వాల్యుయేషన్ ఉంటుందని తెలిపారు. పర్యవేక్షణ పక్కాగా ఉండాలన్నారు. హాల్‌టికెట్ ఉన్న విద్యార్థులను ఉచితంగా పరీక్షా కేంద్రాలకు వెళ్లే విధంగా ఏపీఎస్ఆర్టీసీ అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఉంటుందని తెలిపారు. డిఇఒ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కులశేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆనందరెడ్డి, ప్రజారోగ్య అధికారి హరికృష్ణ, జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



టిటిడి ఉద్యోగులకు మరో 132 ఎకరాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

వడమాలపేట వద్ద మిగిలిన 132 ఎకారాల భూమిని టిటిడి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కోసం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రెవెన్యూ, ఎండోమెంట్స్ డాక్టరు ఎం.హరిజవహర్‌ను టిటిడి ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో నెంబరు 43కు సవరణ చేసి, టిటిడిలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన రిటైర్డు, చనిపోయిన వారికి ఇళ్లస్థలాలు కేటాయింపు చేయనున్నారన్నారు. టిటిడి ఉద్యోగులకు ఇళ్లస్థలాల గురించి వడమాలపేట వద్ద ఇప్పటికే 300 ఎకరాలు ఉద్యోగుల కోసం కేటాయించారని, అక్కడే ఇంకా మిగిలి ఉన్న 132 ఎకరాల స్థల సేకరణకు టిటిడి యాజమాన్యాన్ని కోరిన మేరకు టిటిడి పాలకమండలి తీర్మానం చేసి, ప్రభుత్వ అనుమతి కోసం పంపిందన్నారు. టిటిడి ఉద్యోగులకు గతంలో టిటిడి యాజమాన్యమే నేరుగా ఇళ్ల స్థలాలు ఇచ్చేది. ప్రస్తుతం న్యాయపరమైన చిక్కులతో టిటిడి నేరుగా ఇళ్ళస్థలాలు ఇవ్వలేమని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే సొసైటీగా ఏర్పడితే ఇళ్ల స్థలాలు కోసం తాము సహకరిస్తామని, సొసైటీగా ఏర్పడమని చెప్పిన మేరకు తాము సొసైటీగా ఏర్పడ్డామన్నారు. హౌసింగ్ సొసైటీ జీవో



నెంబరు 43 ప్రకారం సర్వీసులో ఉన్న వారికే వర్తిస్తుంది. అయితే టిటిడిలో 30-40 ఏళ్లు సర్వీసు చేసి, టిటిడి ఇళ్లస్థలాలు కోసం దరఖాస్తు చేసుకొమ్మన్న మేరకు చలాన్‌లు కట్టి, టిటిడి వద్ద నమోదై ఉండి, ప్రస్తుతం రిటైరు అయినా, చనిపోయిన వారి వారసులకు మినహాయింపు ఇవ్వాలని, టిటిడి పాలమండలి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిందని గుర్తు చేశారు. ఈ విషయాలపై ప్రభుత్వ అధికారులతో చర్చించి, అనుమతుల కోసం టిటిడి అధికారుల సహాకారంతో హౌసింగ్ సొసైటీ సభ్యులు ప్రభుత్వంతో చర్చించి అనుమతులు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గంపల వెంకటరమణారెడ్డి, కార్యదర్శి గోల్కొండ వెంకటేశం, కోశాధికారి మేడికొండ ప్రసాదరావు, డైరక్టర్లు బాటోత్ బాస్కర్, మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ముందు ఫ్లెక్సీలు తొలగించాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి



తిరుపతిలోని డాక్టరు బిఆర్ అంబేద్కర్ విగ్రహం కనపడనీయకుండా పెడుతున్న ఫ్లెక్సీలను తొలగించాలని, ఫ్లెక్సీలు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్ దళ్ నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ దేశానికి దశదిశ నిర్దేశించిన మహోన్నతుడు డాక్టరు బిఆర్ అంబేద్కర్ అని, ఇటీవల తిరుపతి బస్టాండు సమీపంలో ఉన్న ఆయన విగ్రహం ముందు కొంత మంది తెలిసో, తెలియకో, ఉద్దేశపూర్వకంగానే పబ్లిసిటీ కోసం వ్యాపార ప్రకటనల ఫ్లెక్సీలు కడుతున్నారన్నారని తెలిపారు.అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పున్నాక సురేష్, చిరంజీవి, కె.రాధాకృష్ణ, కలువకుంట చెన్నకేశవులు పాల్గొన్నారు.

నేడు న్యూరోసర్జరి చైర్ ఒరేషన్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్ న్యూరో సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదిన బయో- ఎథిక్స్ ఆఫ్ మెడిసిన్ అనే అంశంపై చైర్ ఒరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రిజిస్ట్రారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పద్మావతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్యక్రమానికి కేరళ రాష్ట్రం తిరువనంతపురానికి చెందిన శ్రీచిత్ర తిరువాల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సస్ అండ్ టెక్నాలజీ డైరక్టర్ డాక్టరు సంజయ్ బీహారి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

త్వరలోనే 'కువైట్ - తిరుపతి'కి విమాన సౌకర్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి కువైట్ నుంచి నేరుగా విమాన సౌకర్యం కల్పించనున్నట్లు తిరుపతి ఎంపి గురుమూర్తి చెప్పారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి దేశంలోని ఇతర ప్రధాన విమానాశ్రయాల మధ్య మరింత ఎక్కువ కనెక్టివిటీ అవసరమని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కలిసి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి వివరించారు. ఈ విషయం గూర్చి ఇదివరకే ఆయనకు లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేసారు. అంతర్జాతీయ ప్రయాణికుల, వారి వస్తువుల రవాణాకు అవసరాలను తీర్చడానికి విమానాశ్రయం సిద్ధంగా ఉందని వివరించారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం మిడిల్ ఈస్ట్ ప్రత్యేకించి కువైట్‌కు వెళ్లే ప్రయాణీకులకు గేట్‌వేగా ఉపయోగపడుతుందని, ఈ విమానాశ్రయం తిరుపతి, నెల్లూరు ప్రకాశం, చిత్తూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణీకుల సంభావ్యత కలిగి ఉందని తెలిపారు. త్వరలోనే కువైట్ నుంచి తిరుపతికి అంతర్జాతీయ విమాన సౌకర్యం కల్పిస్తామని సింధియా హామీ ఇచ్చారని తెలిపారు.

తుంబవానిగుంట స్కూల్లో లయన్స్‌క్లబ్ వితరణ



తిరుపతి టౌన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి సెవన్‌హిల్స్ ఆధ్వర్యంలో శివజ్యోతినగర్‌లోని తుంబవానిగుంట నగర పాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే వందమంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి, జామెంట్రీ బాక్స్, స్కేల్, పెన్, పుస్తకాలు వితరణ చేశారు. అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి వి.జగన్నాధం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు సుజాత, లయన్స్‌క్లబ్ సభ్యులు బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, రామారావు, స్కూల్ ఛైర్మన్ కదిరి రాజేంద్ర, రఘునాథ్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'పై విస్తృత ప్రచారం



తిరుపతి టౌన్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తిరుపతి నగరంలో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ తెలిపారు. బిజెపి ప్రభుత్వం రైతులు, కార్మికులను, కూలీలను విస్మరిస్తూ, అంబానీ, అదానీ సేవలో మునిగిపోయిందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వ తీరుపై విస్తృత ప్రచారం చేస్తూ తలపెట్టిన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పి.మునిరాజా, చిన్న, మురళి, మల్లికార్జున్, రాధాక్రిష్ణ, వి.మోహన్‌రావు, మునిరాజా, డి.మోహన్‌నాయుడు, రామకృష్ణ, శంకర పాల్గొన్నారు.

ఎస్వీ ఆయుర్వేద కళాశాలకు మూడు ఐఎస్ఒ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి



శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాలకు మూడు విభాగాల్లో ఐఎస్ఒ సర్టిఫికెట్లు లభించాయి. బుధవారం ఈవో ఎవి ధర్మారెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ అందుకున్నారు. ఆయుర్వేద వైద్య కళాశాలలో విద్యుత్ పొదుపు చేసినందుకు, కళాశాల ఆవరణంలో పచ్చదనం పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు ఉత్తమ విధానాలు అమలు చేస్తున్నందుకు సర్టిఫికెట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ఐఎస్ఒ ప్రతినిధులు శివయ్య, మౌళిక పాల్గొన్నారు. ఎస్వీబీసీ నిర్వహణలో ఉత్తమ విధానాలు అమలు చేస్తున్నందుకు ఐఎస్ఒ సర్టిఫికెట్ లభించింది. ఎస్వీబీసీ సిఇఒ షణ్ముఖ్ కుమార్ ఈవో చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

3-5 తేదీల్లో శ్రీకోదండరాముని తెప్పోత్సవాలు

తిరుపతి సిటి : శ్రీ కోదండరామస్వామి తెప్పోత్సవాలు ఏప్రిల్ 3-5 తేదీల్లో జరగనున్నాయి. ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి 8.30 వరకు ఈ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు మొదటిరోజు ఐదు చుట్లు, రెండో రోజు ఏడు చుట్లు, చివరి రోజు తొమ్మిది చుట్లు స్వామివారు తెప్పలపై విహరిస్తారు.

ఎస్వీసీఈలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల జాతీయ సేవా పథకం, వుయ్ ఆర్ విత్ యు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, రుయా మెడికల్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆపద సమయాల్లో తోటి వారికి రక్తదానం చేయడం ఎంతో గొప్ప కార్యక్రమమని, స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో 143 యూనిట్ల రక్తాన్ని విద్యార్థులు అందించారు. జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ చంద్రయ్య, సుజన్ కుమార్, ట్రస్ట్ సభ్యులు రేవంత్ సాయి, మోహన్, ప్రీతి, లిఖిత పాల్గొన్నారు.



మునిశేఖర్‌కు పిహెచ్‌డి



తిరుపతి సిటి స్విమ్స్ ఫిజియాలజి విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి కార్ల మునిశేఖర్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసపి (పిహెచ్‌డి) ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టరు శరణ్ ఇ సింగ్ పర్యవేక్షణలో 'ఎఫెక్ట్స్ ఆఫ్ కౌగీ ఆఫ్ లిపిడ్ పెరాక్సిడేషన్ అండ్ లిపిడ్ ప్రొఫెల్ ఇన్ హెల్తీ హ్యూమన్ వాలంటరీస్ బిఫోర్ అండ్ ఆఫ్టర్ కంష్యూమింగ్ గీ' అనే అంశంపై పరిశోధన ప్రతం సమర్పించారని తెలిపారు.

మహిళల అభ్యున్నతికే వైఎస్సార్ ఆసరా పథకం


సత్యవేడు

ప్రజాశక్తి-సత్యవేడు: మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసమే తమ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గుర్తు చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిపి ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ క్రాంతి పథం ఏపిఎం స్వర్ణలత ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏపిఎం బాలాజీ రెడ్డి, గ్రామ సర్పంచ్ మంజుల రమేష్, సూలూరుపేట ఆర్డీవో చంద్రముని తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం మాట్లాడుతూ రాష్ట్రంలో పసిపిల్లల నుంచి అవ్వ తాతల వరకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం సంబంధించి 977 డ్వాక్రా సంఘాలకు రూ.9,25,39,913 కోట్లు వారి పొదుపు అకౌంట్లో ప్రభుత్వం జమ చేసినట్టు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం స్వర్ణలత పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూలూరుపేట ఆర్డీవో చంద్రముని, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ పురుషోత్తం రెడ్డి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో బాలగణేష్, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కెవిబి పురం: మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసమే తమ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నట్టు తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గుర్తు చేశారు. బుధవారం కెవిబి పురం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ మునిలక్ష్మీ నందకుమార్ అధ్యక్షతన వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి మూర్తి మునియమ్మ, హిస్టర్ అకాడమీ డైరెక్టర్ వర్గల కష్టయ్య, మదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయ రెడ్డి, గ్రామ సర్పంచ్ గిరిబాబు తదితరులు హాజరయ్యారు. మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం సంబంధించి 809 డ్వాక్రా సంఘాలకు రూ.6,30,30073 లు వారి పొదుపు అకౌంట్లో ప్రభుత్వం జమ చేసినట్టు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అయ్యప్ప, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ హరిబాబు, లాల్ బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని టీడీపీ మోసం చేస్తే.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆసరా పథకం పెట్టి ఆదుకున్నాడని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు నేచర్ క్యాంప్



ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో బుధవారం పూల తోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పక్షుల కేంద్రం అధికారుల ఆధ్వర్యంలో సూళ్ళూరుపేట డివిజన్ సామ్యూల్ అధ్యక్షతన నేచర్ క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నేలపట్టు పక్షుల కేంద్రం విశిష్టతను, ఆ కేంద్రానికి వచ్చు విదేశీ విహంగాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు నేలపట్టు పక్షుల కేంద్రం, పర్యావరణంలపై విహంగాల గురించి వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను డీఎఫ్ఓ సామ్యూల్ చేతుల మీదుగా అందజేశారు. నేలపట్టు పక్షుల కేంద్రం రేంజర్ వరప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏప్రిల్ నుండి ఉపాధి కూలి పెంపు



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఏప్రిల్ నుండి ఉపాధి కూలీల కూలి పెరగనున్నట్లు తిరుపతి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన ఎగువురు గ్రామపంచాయతీలో చేపట్టిన పౌండ్ ట్రెంచ్ పనులు, నెల్లుట్ల వారి పల్లి గ్రామపంచాయతీలోని మూతపాకుల కుంటలో జరుగుతున్న క్యాటిల్ బాండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన ఎంత కూలి గిట్టుబాటు అవుతోందని ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి పెరిగిన కూలితో కలిపి రూ.272 లు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఎస్.మత్యుంజయరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు నాగేశ్వర, రాధా సులోచన, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



ప్రజాశక్తి-గూడూరు: పట్టణంలో ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నేటితో ముగిశాయి. పట్టణంలోని 5 పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రశ్న పత్రాల విత్ డ్రా సమయంలో నెల్లూరు జిల్లా ప్రాంతీయ జిల్లా పర్యవేక్షణ అధికారి కన్వీనర్ టి.వరప్రసాదరావు పర్యవేక్షించి తెలియజేశారు. అనంతరం సహాయ సహకారాలు అందించిన పోలీస్ సిబ్బందికి, మెడికల్ సిబ్బందికి ఎస్కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.కోటేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



ప్రజాశక్తి-బాలాయపల్లి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తహశీల్దారు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ సిబ్బంది తహశీల్దారు కార్యాలయంలో ఎపిఆర్ఎస్ఎ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన సమయంలో ప్రజా సమస్యలకు ఎటువంటి అవాంతరం కలుగనీకుండా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, తిరుపతి జిల్లా ఎపిఆర్ఎస్ఎ ఉపాధ్యక్షుడు, అజ్మతుల్లా ఖాన్, ఆర్ఐ పూర్ణ, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది, విఒలు తదితరులు పాల్గొన్నారు.

మంచి పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పద్మజ పేర్కొన్నారు. బుధవారం స్త్రీ మరియు శిశుసంక్షేమ శాఖ, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలు దాదాపు 100 మందికి పోషకాహార ప్రాధాన్యత, చిరుధాన్యాల ఆవశ్యకత గురించి పద్మజ అవగాహన కల్పించారు. సిడిపిఒ కసిరెడ్డి పద్మజ, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జరిగిన చిరుధాన్యాల మహోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఎంపీడీవో శివ ప్రసాద్, సంఘమిత్ర అధ్యక్షురాలు మాధవి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు శ్రీపతి మురళి, సుభాషిణి, రెడ్డమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

దేశ భక్తి ముసుగులో 'సహారా' ఆర్థిక నేరాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశ భక్తి ముసుగులో సహారా ఇండియా సంస్థ లక్షల కోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడిందనీ, కారాగారంలో ఉండాల్సిన ఆ సంస్థ అధినేత శుభ్రతో రాయ్ ఫెర్రోల్ బయట తిరుగుతున్నాడంటూ ఆల్ ఇండియా జన్ సంఘర్ష్ మోక్షా జాతీయ అధ్యక్షురాలు పూజిత బుధవారం విమర్శించారు. ఆల్ ఇండియా జన్ సంఘర్ష్ మోక్షా జాతీయ అధ్యక్షురాలు పూజిత 'సహారా ఇండియా' ఆర్థిక మోసాలపై బుధవారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి గళమెత్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహారా సంస్థ బాధితులకు నయా పైసాతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. 'దేశం..దేశ భక్తి' మాటున పురుడుపోసుకున్న ఆ సంస్థ ఈ 45 ఏళ్ల కాలంలో లక్షల కోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడిందని ఆరోపించారు. ఆర్థిక సుస్థిరత కల్పిస్తామని పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఆశ చూపి, స్కీములు పెట్టి, స్కాములు చేసిందని మండిపడ్డారు. ముఖ్యంగా రియల్ వ్యాపారం పేరిట పేదల వద్ద డబ్బులు వసూళ్లు చేసి వాటిని దారి మళ్లించి దేశ వ్యాప్తంగా 101 పట్టణాల్లో లక్షల ఎకరాల భూములను సహారా కొనుగోలు చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పదించి సహారా సీఆర్సీలో దాచిన సొమ్మును బాధితుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సహారా ఆర్థిక నేరాలపై సిట్ వేసి ఆర్థిక నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహారా బాధితులకు న్యాయం జరిగేలా ఏప్రిల్ 3న తిరుమలకు పాద యాత్ర చేపడుతున్నామనీ, 4న తిరుపతిలో మహా సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహా సభకు దేశ వ్యాప్తంగా ఉన్న సహారా బాధితులు హాజరవుతారనీ, శ్రీకాళహస్తి ప్రాంత బాధితులు సాయం కోసం సెల్: 9121099373 నంబర్ ను సంప్రదించాలని కోరారు. స్థానిక వైసీపీ కార్యకర్తలు దీపిక, జయశ్రీ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లకు రక్షణ కల్పించాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలో కీలకమైన ఎండీయూ ఆపరేటర్ల ఖాతాల నుండి ఇన్సూరెన్స్‌కు గత జనవరి, ఫిబ్రవరి మాసాల్లో రూ.18,900, 27 వేలను కట్ చేయడం జరిగిందని, కానీ ఇంతవరకు ఇన్సూరెన్స్ కాపీలను వారికి అందించడంలో బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కాపీలు సకాలంలో అందక వాహనంకు సంబంధించి ఫిట్నెస్ సర్టిఫికెట్ ను చేయించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆలస్యం కారణంగా ఎండియు ఆపరేటర్లే రవాణా శాఖకు అదనపురుసుము చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. గత ఆరు నెలలుగా ఐసిడిఎస్ ఎండిఎంకు సంబంధించి కమిషన్ పెండింగ్లో ఉందని తక్షణమే కమిషన్ను విడుదల చేయాలని కోరారు. మార్చి నెలాఖరు లోపు ఎండీయూ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో విధులకు హాజరు కాలేమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వేణు, సోమనాదం, దయాకర్, చిన్నారెడ్డి, దీవ, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తాం



ప్రజాశక్తి-సత్యవేడు: తిరుపతి జిల్లా నాగలాపురం కేంద్రంగా నడుస్తున్న సత్యవేడు మార్కెట్ కమిటీ ద్వారా ఈ ప్రాంత రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తామని సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సునంద పద్మనాభం చెప్పారు. బుధవారం సత్యవేడులో స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి ఆమె మాట్లాడారు. రైతులు రేయింపగళ్ళు చెమటోడ్చి పండించిన పంటలను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు మార్కెట్ కమిటీ గోడౌన్‌లో నిల్వ చేసుకోవచ్చునన్నారు. వరి, వేరుశనగ, సజ్జలు వంటి పంట దిగుబడులను 90 రోజుల వరకు ఉచితంగా నిల్వ చేసుకోవడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మూడు నెలలు దాటిన తర్వాత ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రైతులు నిల్వ చేసుకున్న పంటలకు సంబంధించి తక్కువ రుసుము చెల్లించాలని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా తనిఖీ కేంద్రాల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 13 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నట్టు ఆమె చెప్పారు. ఏది ఏమైనా వ్యవసాయ మార్కెట్ కమిటీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఈ ప్రాంత రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సేవలను మరింత విస్తతం చేయడంపై దష్టి సారిస్తామన్నారు.

మహిళల ఆనందోత్సవాల 'ఆసరా'



ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరిలో ప్రారంభమైన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మహిళల ఆనందోత్సవాల నడుమ అట్టహాసంగా సాగింది. సరిగ్గా శ్రీరామ నవమి పండుగ సమయంలో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత పొదుపు సంఘాల రుణాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో అక్కచెల్లెమ్మలు ఆనందంతో ముఖ్యమంత్రి జగన్ చిత్ర పటానికి పాలుతో అభిషేకం చేశారు. బుధవారం చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆసరా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 58,409 మంది లబ్ధిదారులకు మూడవ విడత గా రూ. 64.37కోట్లు మంజూరు చేసిన జగనన్నకు కతజ్ఞతగా పనిచేయాలన్నారు.

వారపు సంతల్లో భోజన వసతి:
చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా వారపు సంతల్లో భోజన వసతి సదుపాయాలను ఏప్రిల్ రెండవ వారం నుంచి కల్పించనున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి వెల్లడించారు. మహిళలకు ఇచ్చే ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రకాశం భవనం ఎదురుగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని టిఎన్ఎస్ఎఫ్ తెలుగు యూత్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురువేసి ఆ సంఘ నేతలు స్వర్గీయ నందమూరి తారక రామారావుకి బుధవారం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కే. హేమంత్ రాయల్, నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.


తిరుపతిలో...

తిరుపతి(మంగళం): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని



మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో పంచాయతీ టీడీపీ అధ్యక్షులు అజీస్ భాష, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, టిడిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. సీనియర్ టిడిపి నాయకులు గట్టు వెంకటరమణ, చంద్ర, వెంకటకష్ణ, సదాశివం పాల్గొన్నారు.

బాలాయపల్లి: బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో 41వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల టీడీపీ సీనియర్ నాయకులు రాయి మస్తాన్ నాయుడు, రామచంద్ర నాయుడు పాల్గొన్నారు

తిరుచానూరు: చిత్తూరు జిల్లా పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి అధ్యక్షతన తిరుచానూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరి రామ్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పుత్తూరులో స్థానిక అంబేద్కర్ సర్కిల్ ఎదురుగా తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణ అధ్యక్షులు టిడిపి జీవరత్నం నాయుడు, రూరల్ అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేసి జరుపుకున్నారు. రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ టిఎన్టిసి అధ్యక్షులు రావిళ్ళ మాధవ నాయుడు, ఎస్టీ సెల్ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బుధవారం పార్టీ జెండాను ఎగరవేశారు. మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఉపాధ్యక్షులు మందాటి పురుషోత్తం యాదవ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాకాల: తెలుగుదేశం పార్టీని స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కష్ణమనేని సావిత్రి తెలుగుదేశం పార్టీ జెండాను బుధవారం ఆవిష్కరించారు. సర్పంచ్ చంగల్ రాయలు, జగదీష్, కుమార, వేణుగోపాల్, నాగరత్న, టిడిపి కుటుంబ సభ్యులు, మహిళలు, పెద్దలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు మహోన్నత వ్యక్తి అని దివంగత మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బందమ్మ కీర్తించారు. తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం తొట్టంబేడు మండలం, శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు.

రేణిగుంట: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక టీడీపీ నాయకులు బుధవారం ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి స్థానిక ప్రముఖులకు స్వీట్లు పంచిపెట్టి ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. టీడీపీ మండల నాయకులు, పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండలంలో టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. మండల కమిటీ అధ్యక్షులు దేశి రెడ్డి రఘునాథ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మండల నాయకులు జగదీష్‌లు పాల్గొన్నారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సేవలు భేష్



ప్రజాశక్తి-తిరుచానూరు: ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు తిరుపతి రూరల్ ఎంపిపి మోహిత్ రెడ్డి రూరల్ బాధ్యతలతో పాటు చంద్రగిరి నియోజకవర్గ బాధ్యతలను ప్రజా సంకల్ప యాత్ర ద్వారా సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న అయనకు పద్మావతి అమ్మవారు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వైసిపి శ్రేణులు 516 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి నేతత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు ఎంపిపి మోహిత్ రెడ్డి ప్రజలు చేస్తున్న సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదర్శాలు పునికిపుచ్చుకున్న మోహిత్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న విధానం హర్షనీయమన్నారు. ఒక వైపు సమస్యలు అడిగి తెలుసుకుంటూ, మరో వైపు పార్టీని విస్తతం చేస్తున్నారని ప్రశంసించారు. బ్రాహ్మణపట్టు ఎంపిటిసి యోగానంద రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ తిరుమలయ్య, ఎంపీటీసీలు శేఖర్ రెడ్డి, నరేష్ రెడ్డి, వార్డు మెంబర్లు మునేంద్ర, చంద్రరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఒ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం, రామసముద్రం గ్రామంలో ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను బుధవారం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల మరియు క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా చేతుల మీదుగా ప్రారంభించారు. వడమాలపేట మండల ఎంపీపీ, విజయలక్ష్మి, వైస్ ఎంపిపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కమిటీల ఛైర్మెన్లు, సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే టీడీపీ ధ్యేయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అన్ని వర్గాల అభివృద్ధే టీడీపీ ధ్యేయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్ర ప్రతినిధుల సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు తన సందేశాన్ని పత్రికా ప్రకటన ద్వారా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ ముహూర్తాన రామారావు పార్టీని స్థాపించారో గానీ ఆరోజు నుంచి ఈరోజు వరకు ప్రజా ప్రస్థానంలో తెలుగు ప్రజల ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ అన్‌స్టాపబుల్‌గా విరజిల్లుతోందన్నారు.

చెవిరెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-క్యాంపస్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల సమన్వయ కర్త, చంద్రగిరి శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నూతనంగా ఎన్నికైన తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేతలు బుధవారం సత్కరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి విభాగం బలోపేతానికి కషి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేదవాడు ఉన్నతమైన విద్యను అభ్యసించాలనే తపనతో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. విద్యార్థి విభాగం నాయకులు నాగరాజు, మని, భరత్, కేదర్, ప్రశాంత్, ప్రసన్న, నిహాల్ పాల్గొన్నారు.

శివుని దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి-సత్యవేడు: తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచల శివుని దర్శనానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్టీసీ బస్సును నడుపుతున్నట్టు తిరుపతి జిల్లా సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ బుధవారం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యవేడు బస్టాండ్ నుంచి ఉదయం 8 గంటలకు (పౌర్ణమి రోజున) బయలుదేరే ఆర్టీసీ బస్సు వయా పుత్తూరు, చిత్తూరు, కాణిపాకం, తమిళనాడు వేలూరు గోల్డెన్ టెంపుల్ మీదుగా తిరువణ్ణామలై వెళ్తుందన్నారు.

నియామకం



ప్రజాశక్తి-పిచ్చాటూరు: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలిగా సీనియర్ కవయిత్రి, పిచ్చాటూరు ఎంఈఓ కొరిని హేమ మాలిని నియమితులయ్యారు. ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఐఎస్ ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో తిరుపతి మహతి కళాక్షేత్రంలో 48 గంటలపాటు ప్రపంచ రికార్డు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎంతో బృహత్తర సాహితీ, కళా పండగ నిర్వహణలో తనను కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలిగా నియమించిన ఛైర్మన్ ప్రతాప్‌కు హేమమాలిని ధన్యవాదాలు తెలిపారు. విజయవంతంగా సాహితీ బ్రహ్మోత్సవాల నిర్వహణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

హేమమాలిని నియామకంపట్ల పలువురు అభినందనలు: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలిగా హేమమాలినిని నియమించడం పట్ల శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి, ఏ.పి. రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. రమేష్ నారాయణ, తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవ జయపాల్, గంజాం భ్రమరాంబ, విజయకుమారి, ధనశ్రీ ఉషారాణి అభినందనలు తెలిపారు.

31 వ తేదీ లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఇంటి, కుళాయి, ఖాళీ స్థలముల పన్నులు ఈ నెల 31 వ తేదీ లోగా చెల్లించి, ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ వినియోగించుకోవాలని గూడూరు పురపాలక కమిషనర్ సాయినాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు.

వేలం వాయిదా...
మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌కు నిర్వహించిన వేలం గతంలో కంటే తక్కువగా పాడినందువల్ల వేలం పాటను రద్దు చేసినట్లు గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ తెలిపారు. తదుపరి పాట ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్వహించబడే తేదీని పత్రికా ముఖంగా తెలియజేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

మంత్రి కృషితో పట్టణ అభివృద్ధి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో ప్రజలు అందరూ ఆనందంగా ఉండాలని చింతలగుంట వద్ద, గేట్ పుత్తూరులో పార్కుల ఏర్పాటుకు మంత్రి ఆర్కే రోజా కృషి చేసినట్లు మున్సిపల్ ఛైర్మన్ ఎ హరి పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ కార్వేటినగర్ రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ భవనంలో ఛైర్మన్ హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ సమావేశంలో అజెండా చదివి వినిపించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి. కౌన్సిలర్లు గాలి జీవరత్నం నాయుడు మాట్లాడుతూ కుక్కలు, కోతులు ఎక్కువగా ఉన్నాయని కోతులను పట్టి అడవుల్లో వదిలేయాలని, కుక్కలకు టీకాలు వేయించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్ కేశవులు, వైసిపి కౌన్సిలర్ ఏకాంబరం పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ ఉత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛ ఉత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం వద్దనున్న ఫ్లై ఓవర్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించిన స్వచ్ఛ మాషల్ మార్చి ర్యాలీని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎంఎన్ రెడ్డి, ఛైర్మన్ ఎ హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు ప్లాస్టిక్ నియంత్రణ, తడి చెత్త పొడి చెత్త మరియు హానికరమైన చెత్తను వేరుచేసి పరిశుభ్రత సిబ్బందికి అందజేయాలన్నారు. వైస్ ఛైర్మన్ డి శంకర్, కౌన్సిలర్ గుణశేఖర్, విఆర్ఒ గురుస్వామి, ఆలయ ఛైర్మన్ మనోహర్ రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సెలెక్ట్రా 23వ జాతీయ సదస్సు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో జరిగిన సెలెక్ట్రా 23 జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా వర్సిటీ బిఒఎస్ ఛైర్మన్ పి.వెంకట కష్ణ, గౌరవ అతిథిగా హాజరైన ఇన్ఫ్రాకప్ప అంబాసిడర్ వి.రవీంద్ర రెడ్డితో కలిసి పోటీలలో గెలుపొందిన ఇంజినీరింగ్ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, సియస్ఇ విభాగాధిపతి వి.సరిత, కన్వీనర్ యన్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఏఐఎస్ఎఫ్‌లో చేరాలని జిల్లా కార్యదర్శి బండి చలపతి బుధవారం పిలుపునిచ్చారు. వర్సిటీలో వివిధ విభాగాల్లో ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ లో సభ్యులు గా చేరి, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులపై వైకిరి మార్చుకునే వరకు ఏఐఎఫ్ఎఫ్‌తో కలిసి పోరాటాలు చేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, సుందర్ రాజు, ప్రవీణ్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అక్షరధామ్ స్వామి నారాయణ సంస్థల అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-క్యాంపస్: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహింప బడుతున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, ఢిల్లీ అక్షరధామ్ కు చెందిన స్వామి నారాయణ సంస్థల పీఠాధిపతి భద్రేశ్ దాస్ స్వామి వారు సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య రాణీ సదాశివమూర్తి ఢిల్లీ అక్షరధామ్ కు చెందిన స్వామినారాయణ సంస్థల పీఠాధిపతి భద్రేశ్ దాస్ స్వామి పరస్పరం పరిశోధన, బోధన నైపుణ్యాలు అంశాలపై ఎంఓయూ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శైక్షిక సంకాయ ప్రముఖులు ఫణి యజ్ఞేశ్వర యాజులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా ఆస్థానం జరుగనుంది. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీరాములవారు హనుమంత వాహనంపై మాడవీధులలో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. అదేవిధంగా, శ్రీవారి ఆలయంలో మార్చి 31న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమంతులవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.